క్లుప్తంగా

సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పెళ్లిపిలుపు


సీఎం జగన్‌కు వివాహ ఆహ్వానపత్రిక అందజేస్తున్న శ్రీమంత్‌రెడ్డి, హారిక

సూళ్లూరుపేట: మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, హారికరెడ్డి దంపతులు మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మౌనిక వివాహ ఆహ్వానపత్రిక అందజేసి, పెళ్లికి రావాలని ఆహ్వానించారు. మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి మరదలు మౌనిక వివాహం జరగనుండడంతో శ్రీమంత్‌రెడ్డి, హారికరెడ్డి దంపతులు, చైర్మన్ తల్లి దబ్బల సౌదామని, మామ అచ్చాల శ్రీనివాసులరెడ్డి మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సీఎం స్వయంగా కలిసి, వివాహ మహోత్సవ ఆహ్వానపత్రికను అందజేశారు.

వ్యవసాయ పరికరాల అందజేత


పనిముట్లు అందజేస్తున్న వ్యవసాయశాఖ, బ్యాంకు అధికారులు

చిల్లకూరు: బల్లవోలులో రైతు గ్రూపు సభ్యులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ పరికరాలను అందజేశారు. బల్లవోలులోని ఆర్బీకే పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన షిరిడీ సాయి సీహెచ్‌సీ గ్రూప్ సభ్యులకు యాంత్రికరణ సేవా పథకం కింద గూడూరులోని ఎన్‌డీసీసీబీ సహకారంతో రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు అందించామని ఏఓ గూడూరు భవానీ తెలిపారు. మండలంలోని 17 ఆర్బీకేల పరిధిలో రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేయడం పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ సరిత, వైఎస్సార్ సీపీ నాయకులు దువ్వూరు చెంచుకిరణ్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు ఎస్‌కే నఫీషా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన సాగును ప్రోత్సహించండి

చిల్లకూరు: సన్న, చిన్న కారు రైతులు ఉద్యాన పంటల సాగు చేసేలా ప్రోత్సహించాలని క్షేత్ర సహాయకులకు ఎంపీడీఓ గోపీనాథ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద మండలంలో సుమారు 5 వేల ఎకరాలు పండ్ల తోటలు పెంపకం లక్ష్యంగా ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని క్షేత్ర సహాయకులు గ్రామాల్లో మెట్ట రైతులతో మాట్లాడి వారు ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటలు సాగు చేసేలా చూడాలన్నారు. ఏపీఓ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్ 3 ప్రారంభం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కలువాయి: వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్ 3 కార్యక్రమాన్ని కలువాయి మండలంలో మంగళవారం ప్రారంభించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ సురేంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమం జూన్ 13వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కలువాయి సచివాలయం -1 పరిధిలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ గురవయ్య కంటి జబ్బులతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేశారు. డాక్టర్ రామకుమారి పాల్గొన్నారు.

స్వచ్ఛ వెంకటగిరి అందరి బాధ్యత


పరిసరాలు శుభ్రత పాటించాలని కోరుతున్న మున్సిపల్ కమిషనర్ రామయ్య

వెంకటగిరి: స్వచ్ఛ వెంకటగిరి అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్య చర్యలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య అన్నారు. మంగళవారం ఆయన పలు దుకాణాల వద్దకు వెళ్లి స్థానికులతో పారిశుద్ధ్య నిర్వహణపై మాట్లాడారు. పట్టణ పరిధిలో ప్రతినెలా పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం రూ.50 లక్షలు వెచ్చిస్తోందని తెలిపారు. పారిశుద్ధ్యం లోపిస్తే వ్యాధులు ప్రబలే అవకాశాలున్న కారణంగా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

డక్కిలి: మండలంలోని నాగవోలు సచివాలయం పరిధిలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు మంగళవారం తెలిపాయి.

ఎండ ప్రచండం


బూదనం వద్ద జాతీయ రహదారిపై చెట్ల కింద ఆపిన లారీలు


వెంకటగిరిలో గొడుగు పట్టుకుని వెళుతున్న ద్విచక్రవాహనచోదకులు

ఉదయం నుంచే నిప్పులు వాన కురుస్తోంది. భానుడి ప్రతాపానికి జనం అల్లాడిపోతున్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలు ఇంట్లో ఉన్నా.. బయటకు వెళ్లినా వేసవి తాపానికి తల్లడిల్లుతున్నారు. ఫలితంగా మధ్యాహ్నం 12 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

- వెంకటగిరిలో 47 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం
- వడమటి గాలుల ప్రభావంతో విలవిల
- సేదదీరేందుకు పడరానిపాట్లు

వెంకటగిరి: పదిరోజుల క్రితం కురిసిన వర్షానికి ఊరట చెందిన ప్రజలు మళ్లీ నాలుగు రోజులుగా కాస్తున్న ఎండలకు అల్లాడుతున్నారు. భానుడి ప్రతాపానికి తోడు వడమటి గాలుల ప్రభావంతో ప్రజలు విలవిలలాడుతున్నారు. ఇదే పరిస్థితి ఎన్ని రోజులు ఉంటుందోనని స్థానికులు కలవరపాటుకు గురవుతున్నారు. ఈ వారంలో నైరుతి రుతుపవనాలు వస్తాయని గంపెడాశలు పెట్టుకున్న రైతాంగం ఈ ఏడాది రుతుపవనాలు ఆలస్యంగా వస్తాయని, జూన్ 4వ తేదీ కేరళ తీరాన్ని తాకుతాయని వాతావరణశాఖ తాజాగా విడుదల చేసిన ప్రకటన వారికి మింగుడు పడడం లేదు. వెంకటగిరి నియోజకవర్గంలో ఇప్పటికే వడదెబ్బ ప్రభావానికి పలువురు మృత్యువాత పడగా పలువురు ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నారు. కాగా గ్రామాల్లో రైతులు, రైతు కూలీలు ఉదయం 5.30 గంటలకే పొలం పనులకు వెళ్లి 9.00 గంటలకు ఇంటి ముఖం పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు వడగాల్పుల తట్టుకోలేక అవస్థ పడుతున్నారు. భానుడి ప్రతాపానికి ఉదయం 10 గంటలకే రోడ్లన్నీ నిర్మానుషంగా మారుతున్నాయి.

కాగుతున్న నీరు

ఇళ్లపైన ట్యాంక్‌ల్లో నిల్వ ఉంచిన నీరు ఉదయం 10 గంటలకే కాగుతున్నాయి. మధ్యాహ్నానికి ఆ నీరు వేడినీటిని తలపిస్తుండడంతో వాడుకునేందుకు జనం జంకుతున్నారు. సాయంత్రం వరకూ ఇదే తీరు ఉండడంతో స్నానం చేసేందుకు భయపడుతున్నారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు.

భగ భగ

గూడూరు: ఎండలు భగ భగ మండుతున్నాయి.. ఉదయం 8 గంటల నుంచే ఇళ్లలోంచి బయటకు రాలేని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో విందూరుకు వెళ్లే రోడ్డు పక్కనే చెట్టు కింద ఉన్న షెడ్‌పై చెట్టు కొమ్మకు తడిపిన చీరతో ఊయల కట్టి, అందులో చిన్నారులను పడుకోబెట్టారు. తల్లులు కూడా వారితోపాటు చెట్టు నీడన సేదతీరుతూ కన్పించారు. వేసవి తాపం కదా.. ఏం చేద్దాం పాపం.


నాయుడుపేటలో బోసిపోయిన వీధి


విందూరు రోడ్డులో ఇలా..

నిప్పుల గుండంలా..

నాయుడుపేటటౌన్: రోజు రోజుకు అధికమైతున్న ఎండల తీవ్రతకు ప్రజలు అల్లాడి పోతున్నారు. ఎప్పుడు జనాలతో రద్దీగా ఉండే నాయుడుపేట ప్రధాన రహదారులు మధ్యాహ్నం 12 గంటలకే జన సంచారం లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. రెండురోజులుగా 42 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. మంగళవారం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

సీఎం జగన్‌తో స్వర్ణయుగం


నవరత్నాల పథకాల ముగ్గును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రానికి స్వర్ణయుగం వచ్చిందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. వజ్జవారిపాళెం, పాళెంపాడు, చవట ఎస్సీ కాలనీ, బండారుగుంట గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికి, సన్మానించారు. అనంతరం ఆయన గ్రామాల్లో నాయకులతో కలసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. పింఛన్ అందుతుందా.. పథకాలు అందుతున్నాయా.. ఇంకా ఏమైనా సమస్యలుంటే చెప్పాలని ఎమ్మెల్యే వృద్ధులతో అప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో డ్రైనేజీ, సిమెంట్‌రోడ్డు తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సీసీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఎంపీడీఓ రజినీకాంత్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు తలుపుతట్టి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జీ రవీంద్రరాజు, సర్పంచ్ కే విజయమ్మ, పీ వేణురెడ్డి, కే ఫణేందర్‌రెడ్డి, ఎస్ మోహన్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, జే నాగరాజు, కే కుమార్‌నాయుడు, ఆర్ సురేష్, బీ రాజారెడ్డి, కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెసర సాగులో సస్యరక్షణ తప్పనిసరి


డక్కిలి: నాయుడుపాలెంలో పెసర పంటను పరిశీలిస్తున్న ఏడీఏ, కేవీకే శాస్త్రవేత్తలు

డక్కిలి: పెసర పంట సాగులో రైతులు సస్య రక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని వెంకటగిరి వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. మండలంలోని లింగసముద్రం రైతు భరోసా కేంద్రం పరిధిలోని నాయుడుపాళెంలో వేసవి అపరాల సాగును వ్యవసాయశాఖ సిబ్బంది, వెంకటగిరి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు రబీ సాగు కింద వరి సాగు చేసి పంట కోత తరువాత పొలాల్లో పెసర పంట ఐపీఎం 2-14 రకం, వేరుశనగ పంటలను సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం పెసర పంట పూత, కాయ దశలో ఉందన్నారు. పంటలో రసం పీల్చే పురుగు ఉన్నట్లు గుర్తించామని, దీని నివారణకు మోనోక్రోటోఫాస్ 2 మిల్లీలను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. వెంకటగిరి కృషి విజ్ఞా కేంద్రం శాస్త్రవేత్త సజీవన మాట్లాడుతూ ప్రస్తుతం పంట పూత, పిందె దశలో ఉన్నందున పచ్చ పురుగు కూడా ఆశించి ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు లార్విన్ అనే మందును పిచికారి చేయాలన్నారు. వ్యవసాయశాఖ అధికారి విజయభారతి మాట్లాడుతూ వైఎస్సార్ రైతు భరోసాకు కొత్తగా పేర్లు నమోదు చేసుకునే రైతులు ఈ నెల18వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని చెప్పారు.

చెన్ను ఆశయాల సాధనకు కృషి


మాట్లాడుతున్న మెట్టుకూరు ధనంజయరెడ్డి

రాపూరు: ఎంపీపీ కీర్తిశేషులు చెన్ను బాలకృష్ణారెడ్డి ఆశయాల సాధనకు కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనంజయరెడ్డి తెలిపారు. సంక్రాంతిపల్లెలోని చెన్ను గార్డన్‌లో మంగళవారం చెన్ను అభిమానులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని చెన్ను అభిమానులకు ఎవరికి ఏ కష్టం వచ్చినా తీర్చేందుకు చెన్ను కుటుంబ సభ్యులు అండగా ఉంటారన్నారు. ఏ అవసరమైనా చెన్ను కుటుంబసభ్యులకు గానీ, తన దృష్టికి కానీ తీసుకురావాలని చెప్పారు. సొంత నిధులతో ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మండలానికి ప్రకటించిన రూ.50 లక్షలు త్వరలో ప్రజల అవసరాలకు వినియోగిస్తామన్నారు. మండలంలో ఆర్వోప్లాంట్ అవసరమైతే ఎంసీ ఫౌండేషన్ తరుపున అందిస్తామని ప్రకటించారు.

ఫ్రీజర్ల అందజేత

చెన్ను కుటుంబసభ్యుల ఆర్థిక సహకారంతో రాపూరు ప్రభుత్వాస్పత్రికి ఒక ఫ్రీజర్‌ను వైద్యులు సరస్వతికి అందజేశారు. మరొకటి రాపూరులో ఉంచుతామని తెలిపారు. ప్రభుత్వాస్పత్రికి అవసరమైన పరికరాల నిమిత్తం నిధులు అందిస్తామన్నారు.

రూ.లక్ష వితరణ

సైదాదుపల్లెలో నిర్మిస్తున్న పాండురంగస్వామి ఆలయానికి చెన్ను బాలకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం చెన్ను సంపూర్ణమ్మ ఆ గ్రామస్తులకు మంగళవారం రూ.లక్ష విరాళం అందజేశారు. పెంచలకోన ఆలయ చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, చెన్ను భాస్కర్‌రెడ్డి, చెన్ను అశోక్‌రెడ్డి, జెడ్పీ ఉపాధ్యక్షురాలు ప్రసన్న, వైస్ ఎంపీపీ ప్రసన్న, మాజీ ఎంపీపీలు ప్రకాష్, పెంచలయ్య, కోఆప్షన్ సభ్యుడు సయీద్ పాల్గొన్నారు.

మండలానికి చేరిన విద్యా కానుక


విద్యా కానుక కిట్లను ప్యాక్ చేస్తున్న అధికారులు

వాకాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న 3,572 మంది విద్యార్థులకు పంపిణీ చేయడానికి జగనన్న విద్యా కానుక కిట్లు మంగళవారం ఎంఈఓ కార్యాలయానికి చేరాయి. ఎంఈఓ బాబు, సీఆర్పీలు మంగళవారం విద్యాకానుక కిట్లను పంపిణీ చేయడానికి సిద్ధం చేశారు.

ముత్యాలమ్మ హుండీ లెక్కింపు



చిల్లకూరు: మండలంలోని తూర్పు కనుపూరులో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపు చేపట్టారు. రెండు నెలల కాలానికి రూ.25,94,638 ఆదాయం వచ్చినట్లు ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త మండలి చైర్మన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, శ్రీలత పాల్గొన్నారు.

రూ.5 లక్షల విరాళం



చిట్టమూరు: మల్లాంలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో నూతన వాహన మండప నిర్మాణానికి మంగళవారం దాతలు రూ.5 లక్షలు విరాళం అందజేసినట్లు ట్రస్టు బోర్డు చైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి తెలిపారు. కోట పట్టణానికి చెందిన కోట రాఘవయ్య, కుమారులు కల్యాణ్‌రామ్, సాయిరామ్‌లు రూ.3 లక్షలు, మనుబోలుకు చెందిన రామిశెట్టి వెంకటరంగారావు, లక్ష్మీప్రసన్న దంపతులు రూ.2 లక్షలు అందజేశారన్నారు.

8 నుంచి చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలు

సూళ్లూరుపేట: చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలను జూన్ 8 నుంచి 14వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వాటంబేడు రోడ్డులో అమ్మవారికి సంబంధించిన 5 ఎకరాల పొలంలో బ్రహ్మోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గతంలో లాగా ఈ సారి వీఐపీ పాసులు లేవని, కేవలం డోనర్లకు మాత్రమే ఇస్తామని చెప్పారు. వారికోసం ఒక సాఫ్ట్‌వేర్ కూడా డెవలప్ చేస్తున్నట్టు వెల్లడించారు. బ్రహ్మోత్సవాలకు డోనర్లు ఇచ్చే ప్రతి రూపాయికి రశీదు ఇస్తున్నామని, తిరునాళ్ల తరువాత డోనర్లు ఎంత ఇచ్చారు.. ఎంత ఖర్చు అయింది.. అనే విషయంలో పారదర్శకతను పాటించి, శ్వేతపత్రాన్ని విడుదల చేస్తామని చెప్పారు. మహిషాసుర మర్దిని ఉత్సవం రోజున భక్తులందరూ దూరం నుంచి వీక్షించేందుకు వీలుగా ర్యాంప్ నిర్మించనున్నట్టు తెలిపారు. అలాగే కాళంగినదిలో తెప్పోత్సవాన్ని ఈ సారి బ్రిడ్జికి తూర్పువైపున మాత్రమే నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దారి కాచి మెడెన్ ఉద్యోగులపై దాడి

నాయుడుపేటటౌన్: మండలంలోని మేనకూరు సెజ్‌లోని మెడెన్ పరిశ్రమలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులపై గుర్తు తెలియని వ్యక్తులు దారి కాచి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటన మేనకూరు ఏపీఐఐసీ కార్యాలయం సమీపంలో రహదారి వద్ద మంగళవారం రాత్రి చోటు చేసకుంది. బాధితులు కథనం మేరకు.. మెడెన్ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనాల్లో తమ ఇళ్లకు బయలు దేరారు. సెజ్ కార్యాలయం సమీపంలోకి వచ్చేసరికి మూడు బైక్‌ల్లో తొమ్మిది మంది వ్యక్తులు దాచి కాచి, ఉద్యోగులను అడ్డగించారు. ఓ బైక్‌లో వస్తున్న ఉద్యోగి సహానిపై కర్రలతో దాడి చేశారు. మరో బైక్‌లో వస్తున్న మాలిక్ అనే ఉద్యోగి చూసి, వారిని అడ్డుకునేందుకు వెళ్లగా అతనిపై కూడా దాడి చేశారు. ఈ విషయమై ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్షతగాత్రులు ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి, చికిత్స చేయించుకున్నారు. నిందితులను గుర్తించేందుకు సీఐ నరసింహారావు సారధ్యంలో ఎస్‌ఐ శ్రీకాంత్ గాలింపు చర్యలు చేపట్టారు.

తాగునీటిని సక్రమంగా సరఫరా చేయండి


ఎంపీడీఓను సత్కరిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు మాధవి

చిల్లకూరు: తాగునీటిని సక్రమంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని చింతవరం ఎంపీటీసీ సభ్యురాలు పాలూరు మాధవి ఎంపీడీఓ గోపీనాథ్‌ను కోరారు. మండలంలోని చింతవరం సచివాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో రికార్డులను పరిశీలించి, సిబ్బంది పని తీరు, వలంటీర్ల హాజరుపై ఆరా తీశారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన ఎంపీటీసీ సభ్యురాలు మాధవి ఎంపీడీఓతో మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సరఫరా సక్రమంగా నిర్వహించేలా పంచాయతీ అధికారులకు సూచించాలని కోరారు. పలు పనులకు సంబంధించి నిధుల విడుదలలో జాప్యం ఉందని, దీనిపై కూడా దృష్టి సారించాలన్నారు. స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ పనులు పూర్తి చేసేందుకు సహకారం అందిస్తామన్నారు. అనంతరం ఎంపీడీఓకు శాలువ కప్పి సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి నాగూరయ్య పాల్గొన్నారు.

ఆటో.. జీవితం ఎటో?



కాసులకు కక్కుర్తి.. పరిమితికి మించి లోడ్.. నింబంధనలకు నీళ్లు.. వెరసి ప్రయాణికుల ప్రాణాలు పణం. ఆటో ఎక్కితే క్షేమంగా ఇల్లు చేరతారో లేదో తెలియని పరిస్థితి. అయినా తప్పని అవసరాల రీత్యా జీవితాలకు భద్రత లేదని తెలిసినా ప్రయాణికులు ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. కోట–తిమ్మానాయుడుపాళెం మార్గంలో ఒకే ఆటోలో సుమారు 20 మంది వరకూ టాప్‌ను పట్టుకుని వేలాడుతూ..సర్కస్ ఫీట్‌లు చేస్తూ ప్రయాణించడం చూసిన వారే ఆందోళన చెందాల్సిన పరిస్థితిని సాక్షి మంగళవారం క్లిక్ మనిపించింది.

– గూడూరు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


చిట్టమూరు: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


చిల్లకూరులో..


సైదాపురంలో..

చిట్టమూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని చిట్టమూరు పీహెచ్‌సీ వైద్యురాలు భానుప్రియ అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ చిట్టమూరులో ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లోని వీధుల్లో మురుగునీరు చేరడంతోనే దోమలు ప్రబలి రోగాలు వ్యాప్తి చెందుతాయన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించినట్లు వైద్యులు సయ్యద్ షాలోమ్ అరాఫత్ తెలిపారు. చిల్లకూరులోని పీహెచ్‌సీ నుంచి గ్రామంలో డెంగీ నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే డెంగీని వ్యాప్తి చేసే దోమలు, కీటకాలు నశించిపోతాయన్నారు. మురుగు కాలువల్లో వ్యర్థాలను వేయకూడదని చెప్పారు. సీహెచ్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సైదాపురంలో

సైదాపురం: మండల కేంద్రంలో మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ జనార్దన్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది వ్యాధులపై ప్రజలకు అంగాహన కల్పించాలన్నారు.

వేపినాపిలో..

రాపూరు: మండలంలోని వేపినాపి పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ చేసినట్లు వైద్యులు గిరీష్ తెలిపారు.

డక్కిలిలో..

డక్కిలి: స్థానిక పీహెచ్‌సీ కార్యాలయంలో డెంగీ నివారణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ నుంచి వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారిలోని కమ్మపల్లి రోడ్డు వరకు ర్యాలీ చేశారు. వైద్యులు కలైసెల్వం, హరిత, బిందు ప్రియాంక, ఎంపీహెచ్‌ఓ శివరామకృష్ణ, పీహెచ్‌ఎస్ జతురుత పాల్గొన్నారు.


రాపూరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


డక్కిలిలో..